RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## శ్రీశైలం మండలం సుండిపెంటలో చిరుతపులి

శ్రీశైలం,శ్రీశైలం మండలంలో సుండిపెంటలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. అర్ధరాత్రి సమయంలో రామాలయం దేవాలయం సమీపంలోని ఓ గృహంలోకి ప్రవేశించి రెండు పెంపుడు కుక్కలను చంపి ఎత్తుకెళ్లింది. అర్ధంరాత్రి 10 దాటిన తర్వాత చిరుత ఇంటి ఆవరణంలోనికి ప్రవేశించి ఒక కుక్కను అక్కడే చంపివేసి మరొక కుక్కను నోట కరచి తీసుకేలుతున్న దృశ్యాలను ఉదయం సీసీ కెమెరాలు గుర్తించారు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం తెలిపారు.కాగా శ్రీశైలం మండలం సుండిపెంటలో ఇప్పటికె శివారు ప్రాంతాల్లోనే చిరుత సంచరిస్తూ కుక్కలను చంపివేసిన ఘటనలు అనేకం చోటు చేసుకుంటే ప్రస్తుతం గ్రామంలోని రామాలయం దేవాలయం సమీపంలో సంచరించటం స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తుంది.అటవీశాఖ అధికారులు అటవీప్రాంతం దగ్గరలో ఉండటంతో అర్ధరాత్రి సమయంలో చిరుతలు బయటకు వస్తున్నాయని ప్రజలు రాత్రి సమయాల్లో బయటకు వెళ్ళేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

**94916 28386 85220 22029**

**Land Line No : 08517 224194**

కర్నూలు సంపుటి : 04 సంచిక : 84 శనివారం 27-07-2024 పేజీలు :04 వెల:రూ.2.00


# సైనికుల త్యాగాలను దేశం మరవదు

**ఉగ్రవాదులను సమూలంగా పెకిలిస్తాం**
**కార్గిల్ అమరులకు ప్రధాని మోడీ నివాళి**
**పాక్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు**
**షింకున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు శ్రీకారం**



లద్దాఖ్,జూలై26 : దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన సైనికుల త్యాగాలకు యావత్ భారతావని ఎప్పటికీ రుణపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కార్గిల్ 25వ విజయ దివస్ ను పురస్కరించుకుని శుక్రవారం ఆయన లద్దాఖ్ వెళ్లారు. ద్రాస్‌లోని యుద్ధ స్మారకాన్ని సందర్శించి అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌పై విరుచుకు పడ్డారు. ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలిస్తామని దాయాది దేశాన్ని మరోసారి గట్టిగా హెచ్చరించారు. గతంలో పాకిస్థాన్ పాల్పడిన వికృత ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయినా, చరిత్ర నుంచి ఆ దేశం ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదు సరికదా.. ఉగ్రవాదం, ప్రాక్సీ వార్‌తో ఇంకా మనపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ రోజు నేను మాట్లాడే మాటలు.. ఉగ్రవాదులను తయారుచేస్తున్న వారికి నేరుగా వినబడతాయి. ముష్కరులను పెంచి పోషిస్తున్న వారికి నేను చెప్పేది ఒక్కటే.. వారి దుర్మార్గపు కుట్రలు ఎన్నటికీ ఫలించవు. మా దళాలు ఉగ్రవాదాన్ని నలిపివేసి.. శత్రువులకు తగిన జవాబిస్తాయి అని మోదీ పాక్‌ను హెచ్చరించారు. కార్గిల్ యుద్దానికి లద్దాఖ్ సాక్షిగా నిలుస్తుంది. అమరుల త్యాగాలకు గుర్తుగా విజయ్ దివస్ జరుపుకుంటున్నాం. మన బలానికి, సహనానికి, వాస్తవాలకు ఈ విజయగాథ నిదర్శనం. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన సైనికులు చిరకాలం గుర్తుండిపోతారు. కార్గిల్ యుద్ధ సమయంలో సామాన్యుడిగా సైనికుల మధ్య ఉండే అదృష్టం నాకు దక్కింది. దేశం కోసం వారు చేసిన పోరాటం నా మదిలో నిలిచిపోయింది. లద్దాఖ్, జమ్మూకశ్మీర్ అభివృద్ధి కోసం ఎలాంటి సవాళ్లనైనా భారత్ అధిగమిస్తుంది. మరికొద్ది రోజుల్లో ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదేళ్లు పూర్తవుతాయి. ఇప్పుడు జమ్మూకశ్మీర్ ప్రజలు సరికొత్త భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్నారు. పెద్ద కలల గురించి మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం కశ్మీర్ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు నిలయంగా ఉంది. ఈ భూలోక స్వర్గం శాంతి, సౌభ్రాతృత్వం వైపు వేగంగా పరిగెడుతోందని మోదీ తెలిపారు. అంతకుముందు, యుద్ధ స్మారకం వద్ద కార్గిల్ అమరవీరులకు ప్రధాని నివాళులర్పించారు. వీర జవాన్ల కుటుంబసభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా షింకున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ నిర్మాణపనులను ప్రధాని మోదీ ప్రారంభించారు. టన్నెల్ నిర్మాణ ప్రాంతం వద్ద వర్చువల్‌గా తొలి బ్లాస్ట్ చేశారు. 4.1 కిలోమీటర్ల పొడవైన ఈ ట్విన్ ట్యూబ్ టన్నెల్‌ను 15,800 అడుగుల ఎత్తులో నిర్మించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సాయుధ దళాలను వేగంగా తరలించేందుకు, సైనిక సామగ్రిని చేరవేసేందుకు ఈ సొరంగం సమర్థంగా ఉపయోగపడనుంది. దీని నిర్మాణం పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సొరంగంగా గుర్తింపు సాధించనుంది.పొరుగు దేశం పాకిస్థాన్‌కు ప్రధాని మోదీ వార్నింగ్ ఇచ్చారు. 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ద్రాస్ సెక్టార్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాకిస్థాన్ నేరాలకు పాల్పడి గతంలో విఫలం అయ్యిందని, కానీ ఆ చరిత్ర నుంచి ఆ దేశం ఏమీ నేర్చుకోలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, ప్రచ్ఛన్న యుద్ధంతోనే ఆ దేశం జీవనం చేస్తోందని విమర్శించారు. తాను మాట్లాడే ప్రదేశం నుంచి ఉగ్రదాదులకు పాల్పడుతున్న ముఠా నేతలు తన స్వరాన్ని నేరుగా వింటారని, ఉగ్రవాదానికి ఊతం ఇస్తున్న దేశాలకు ఓ విషయాన్ని చెప్పదలుచుకున్నానని, ఆ దేశ కుంచిత ఆలోచనలు ఎన్నటికీ విజయవంతం కావు అని ప్రధాని తెలిపారు. పూర్తి స్థాయి దళాలతో ఉగ్రవాదుల్ని మా సైనికులు అణిచివేస్తారని, శత్రువుకు బలమైన సమాధానం ఇస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. లదాఖ్ అయినా, జమ్మూకశ్మీర్ అయినా, అభివృద్ధికి అడ్డు వచ్చే ఎటువంటి సవాల్‌ను అయినా ఇండియా ఓడిస్తుందని మోదీ అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఆగస్టు 5వ తేదీ నాటికి అయిదేళ్లు అవుతుందని, జమ్మూకశ్మీర్ ప్రజలు కొత్త భవిష్యత్తు, కొత్త కలల గురించి మాట్లాడుకుం టున్నారని తెలిపారు. మౌళిక సదుపాయాల అభివృద్ధి, పర్యాటక రంగం.. లదాఖ్, జేకేలో వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. కశ్మీర్‌లో కొన్ని దశాబ్దాల తర్వాత సినిమా హాల్‌ను ఓపెన్ చేసినట్లు చెప్పారు. 35 ఏళ్ల తర్వాత శ్రీనగర్‌లో తాజియా ఊరేగింపు జరిగిందన్నారు.

# వైసీపీ పాలన వల్ల ఏపీకి రూ. 76,795 కోట్ల ఆదాయం తగ్గింది : చంద్రబాబు



అమరావతి : గత వైసీపీ ప్రభుత్వం అవలంభించిన ఆర్థిక దోపిడీ వల్ల రాష్ట్రానికి రూ. 76,795 కోట్ల ఆదాయం తగ్గిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేయడంతో పెట్టుబడులు తగ్గిపోయాయని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశంలో శుక్రవారం గత ప్రభుత్వ ఆర్థిక అవకతవలకపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019-24 మధ్య రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతిందని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం మళ్లించారని దుయ్యబట్టారు. డ్వాక్రా మహిళల నిధులను కొట్టేశారు. పంచాయతీలకు వెళ్లాల్సిన నిధులను దారి మళ్లించారు. ప్రభుత్వ ఆస్తులను, విశాఖలో ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టారని విమర్శించారు.పోలవరం పూర్తయి ఉంటే ఏపీకి రూ. 45 వేల కోట్ల ఆదాయం వచ్చేదని వివరించారు. ఇసుక అక్రమాల ద్వారా రాష్ట్రానికి రూ. 7 వేల కోట్లు , గనుల దోపిడీ ద్వారా రాష్ట్రానికి రూ.9,750 కోట్ల మేర నష్టం జరిగిందని అన్నారు. రాజధాని అమరావతిని కొనసాగించి ఉంటే విశ్వనగరంగా అభివృద్ధి చెందేదని, రూ. 3లక్షల కోట్ల ఆస్తి , 7 లక్షల ఉద్యోగాలు వచ్చేవని బాబు పేర్కొన్నారు.ఏపీకి ఆదాయ వనరులు భారీగా తగ్గాయని, వృద్ధిరేటు 13.5 నుంచి 9. 5 శాతానికి పడిపోయిందని వెల్లడించారు. 2014-19 టీడీపీ హయాంలో రాష్ట్రాభివృద్ధి కోసం కొత్త పోర్టులు ప్రారంభించామని వివరించారు. ఏపీకి సుదీర్ఘ తీర ప్రాంతం ఉండడం కలిసి వచ్చే అంశమని అన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# రెడ్‌బుక్ తెరవకముందే జగన్ ఢిల్లీ వెళ్లి గగ్గోలు : మంత్రి నారా లోకేష్



అమరావతి : ఐదేళ్ల వైసీపీ పాలనలో చట్టాలను చేతుల్లోకి తీసుకొని తప్పు చేసిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నానని ఏపీ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఇంకా తాను రెడ్‌బుక్ తెరవకముందే వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌ఢిల్లీ వెళ్లి గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. శుక్రవారం టీడీపీ శ్రేణులు నామినేటెడ్ పదవుల విషయంలో లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పు చేసే వారి పేర్లను రెడ్‌బుక్‌లో నమోదు చేస్తున్నానని అనేక సభల్లో చెప్పానని గుర్తు చేశారు. గడిచిన ఐదేండ్లలో జగన్ రెండుసార్లే ప్రెస్‌మీట్లు పెట్టగా నెలరోజుల వ్యవధిలో ఐదుసార్లు ప్రెస్‌మీట్లు పెట్టారని ఆరోపించారు. మాజీ సీఎం తాను చెప్పే అబద్ధాలను అసెంబ్లీకి వచ్చి చెబితే వాటిలో నిజానిజాలను తాము ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూటమి నేతలు ఎవరూ వైసీపీ నేతల్లా దూషణలకు దిగరని వివరించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.ఏపీలో అకాడమిక్, అడ్మిషన్స్ క్యాలెండర్ ను త్వరలో విడుదల చేస్తామని నారా లోకేష్ ప్రకటించారు. శుక్రవారం జరిగిన మండలి సమావేశంలో కళాశాలలు , వర్సిటీల్లో ఉద్యోగాల భర్తీపై సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో 5 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. జూనియర్ కళాశాలల్లో 4,600 , డిగ్రీ కళాశాలల్లో 2,127 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆగస్ట్ 5 నాటికి డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పూర్తి చేస్తామన్నారు. వర్సిటీలో ఖాళీ పోస్టుల భర్తీపై గవర్నర్‌తో చర్చించామని తెలిపారు.

# భూదందాలు బయటపడుతున్నాయ్

**ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**



అమరావతి,జూలై26: గత ప్రభుత్వ మంత్రులు, ఎమ్మెల్యేల భూ దందాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. మదనపల్లిలో ప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియా స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారని, అక్రమాలు బయటపడతాయని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం చేశారని అన్నారు.మదనపల్లిల్లో ÷ల్స్ దగ్దం ఘటనలో గత ప్రభుత్వ పెద్దలు ఉన్నట్లు తేలిందని, పెద్దారెడ్డి...పెద్దిరెడ్డి ముఠా పేదల భూములు కొట్టేశారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సిగ్గులేకుండా జగన్ ఢిల్లీలో ధర్నా చేశారని, జగన్ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. 'కోర్టులో ఫైల్స్ దొంగతనాలు చేశాడు ఓ మంత్రి. ఇంకో మంత్రి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పత్రాలు తగలబెట్టారు. ఫైల్స్ దగ్ధం ఘటనతో మిథున్ రెడ్డి మాకు సంబంధం లేదు అన్నారు. మరి ఎవరికి సంబంధం ఉందో చెప్పాలి' అని సోమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మొన్నటిదాకా తమరే అధికారంలో ఉన్నారని, బీజేపీలో చేరాలని ప్రయత్నం చేశారని, ప్రయత్నం బెడిసికొట్టిందని సోమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. అధికారం కోసం తప్పుడు పనుల నుంచి తప్పించుకోవడానికి వైసీపీ నేతలు బీజేపీ వైపు చూస్తున్నారని విమర్శించారు. చేసిన పాపాలకు శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రజలు ఇటువంటి దుర్మార్గుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అసెంబ్లీ ఎగ్గొట్టేందుకు ఢిల్లీ పారిపోయారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. శ్వేత పత్రాలపై మాట్లాడే దమ్ము, ధైర్యం వైసీపీ ఎమ్మెల్యేలకు లేదన్నారు. '11 మంది ఉంటే ఏమైంది. ఒక్కరు చాలరా నిజాయితీగా మాట్లాడడానికి' అని సోమి రెడ్డి అన్నారు.

# రాష్ట్ర అప్పులపై సీఎం చంద్రబాబు అబద్దాలు

**తప్పుడు ప్రచారాలతో తప్పుదోవ పట్టించే ప్రయత్నం**
**52 రోజులుగా దాడులు, అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం**
**లెక్కలు చూపాల్సి వస్తుందనే బడ్జెట్ పెట్టడం లేదు**
**శ్వేత పత్రాలతో మభ్య పెట్టే యత్నం**
**మీడియా సమావేశంలో మాజీ సిఎం జగన్**



అమరావతి,జూలై26 : రాష్ట్ర అప్పులపై సీఎం చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ఆరోపించారు. శుక్రవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం తిరోమనంలో వెళ్తోందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 52 రోజుల్లో రాష్ట్రంలో అక్రమాలు, ఆకృత్యాలు పెరిగిపోయాయని ఆరోపణలు గుప్పించారు. ప్రశ్నించే వాళ్లను అణచివేస్తున్నారు. వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విధ్వంస పాలన సాగుతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. బడ్జెట్ కూడా పెట్టలేని స్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉంది. పూర్తి స్థాయి బడ్జెట్ పెడితే బాబు హామీలకు లెక్కలు చూపాల్సి వస్తుంది. అందుకే బడ్జెట్ ప్రవేశపెట్టడానికి వెనకడుగేస్తున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. బాబు పాలనలోనే రాష్ట్రం ఆర్థికంగా దిగజారిందని జగన్ అన్నారు. ఎన్నికల సమయంలో 14 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని చెబుతూ.. సూపర్ సిక్స్ హామీలు జగన్ విమర్శించారు. 'ఇప్పుడు అధికారం వచ్చాక అది చూపించడానికి ఇబ్బందులు పడుతున్నారు. గవర్నర్ ప్రసంగంలో రూ.10 లక్షల కోట్ల అప్పు అయ్యిందని చూపించారు. శ్వేత పత్రాలతో మభ్య పెట్టే యత్నం చేస్తున్నారు. ఆర్బీఐ, కాగ్, రాష్ట్ర బ్జడెట్ లెక్కల ప్రకారం 2024 జూన్ వరకు కూటమి సర్కార్ గ్దదెనెక్కేవరకు రూ.5 లక్షల 18 వేల కోట్ల అప్పు మాత్రమే అయింది. చంద్రబాబు హయాంలో 21.63 శాతం దాకా అప్పు చేశారు. వైసీపీ హయాంలో 12.9 శాతం అప్పు చేశాం. కేంద్ర ఆర్థిక సర్వే మా ప్రభుత్వ పని తీరును మెచ్చుకుంది. బ్జడెట్‌లోనూ ఈ లెక్కలన్నీ చెప్పాల్సి వస్తుందనే పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టడం లేదు. 14 లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పడం సరికాదు' అని జగన్ అన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఎటు వైపు వెళ్తుందో ఆలోచించాలని, పురోగతి వైపు వెళ్తుందా?.. తిరోగమనంలో వెళ్తోందా? గమనించాలని ఏపీ ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ఇచ్చారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచకాలు, చంద్రబాబు విడుదల చేస్తున్న అబద్ధపు శ్వేత పత్రాలు, వైఎస్సార్‌సీపీ హయాంపై చేస్తున్న తప్పుడు ప్రచారాలపై తాడేపల్లిలోని తన కార్యాలయంలో జగన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గత 52 రోజులుగా దాడులు, అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం కొనసాగుతోంది. ప్రశ్నించే వాళ్లను అణచివేసే ధోరణితో పాలన ముందుకు సాగుతోంది. విధ్వంస పాలన కొనసాగుతుంటే.. పోలీసులు పూర్తిగా ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏడు నెలల ఓటాన్ బ్జడెట్ పెడుతోంది. పూర్థిస్థాయి బ్జడెట్ పెట్టే ధైర్యం లేంటే ఎంతటి దారుణమైన, అధ్వానమైన పాలనో అర్థం చేసుకోవాలి. ఫుల్ బ్జడెట్ పెడితే చంద్రబాబు నాయుడు మోసపూరిత హామీలు ఏమైతే ఇచ్చారో.. వాటికి కేటాయింపులు చూపించాల్సిన అవసరం వస్తుంది. అందుకే ఆ పని చేయడం లేదు. చంద్రబాబు 2019లో దిగిపోయే నాటికి రూ.2 లక్షల 72 వేల కోట్ల అప్పు ఉంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఆ అప్పు రూ.5 లక్షల 18 వేల కోట్లకు చేరింది. గ్యారెంటీలు, విద్యుత్ ఒప్పందాలు కలిపినా రూ. 7లక్షల 48 వేల కోట్లు మాత్రమే. అయినా గవర్నర్ ప్రసంగంలో అబద్ధం చెప్పించారు. ఇలా రూ. 14 లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పడం ధర్మమా?. వాస్తవాలపై గవర్నర్‌కు లేఖ రాస్తాం. ఆయనతోనూ అబద్దాలు చెప్పించిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తాం. చంద్రబాబు అధికారం చేపట్టేనాటికి రూ.7 వేల కోట్లకు పైగా ఖజానా సొమ్ము ఉంది. కానీ, మేం అధికారం చేపట్టేనాటికి రూ.100 కోట్లే ఉంది. ఆ విషయాన్ని ఈనాడు కూడా రాసింది. మేం అధికారంలో ఉండగా మేనిఫెస్టోలో ప్రతీ హామీని అమలు చేశాం. డీబీటీ ద్వారా బటన్ నొక్కి రూ.2.71 లక్షల కోట్లు లబ్దిదారులకు జమ చేశాం. పార్టీ, ప్రాంతాలు కూడా చూడకుండా అందరికీ సంక్షేమం అందించాం.

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ , మండలి సమావేశాలు నిరవధిక వాయిదా

అమరావతి : ఆంధ్రప్రదేశ్ శాసనసభ , మండలి సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈనెల 22 నుంచి ప్రారంభమైన సమావేశాలు స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన ఐదు రోజుల పాటు కొనసాగాయి. తొలిరోజు గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశంలో పాల్గొన్నారు.వైసీపీ అధినేత , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు , వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల కండువాలు ధరించి సమావేశానికి హాజరయ్యారు. ఏపీలో కొత్తగా వచ్చిన ప్రభుత్వం అరాచక పాలనను కొనసాగిస్తుందని ఆరోపిస్తూ కేవలం 15 నిమిషాలు కూడా పాల్గొనకుండా సమావేశాన్ని వాకౌట్ చేసి వెళ్లిపోయారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం ప్రశ్నోత్తరాల అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులు తమ శాఖల పరిధిలో వచ్చిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. సీఎం చంద్రబాబు చివరి మూడు రోజులు మూడు శ్వేత పత్రాలను విడుదల చేశారు. ఎక్సైజ్‌శాఖ, శాంత్రిభద్రతలు, ఆర్థికశాఖపై శ్వేత పత్రాలను విడుదల చేసి గత ప్రభుత్వ హయాంలో ఆయా శాఖల్లో జరిగిన అక్రమాలను వివరించారు.

# సంపాదకీయం

శనివారం 27-07-2024

## హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి అడుగులు !

హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం కావాల్సి ఉంది. ప్రధానంగా మురుగునీరు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు,ట్రాఫిక్ సమస్యలు ఎప్పటినుంచో వేధిస్తున్నాయి. నగరంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేసేస్తున్నారు. ఈ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడేసే విధానాలకు స్వస్తి పలకాలి. అవసరమైతే జరిమానాలు విధించాలి. దీనికితోడు నగరంలో రోడ్లపై వెలసిన ఆలయాలు, దర్గాలు, ఇతర కట్టడాల తొలగింపుపై కఠిన చర్చలకు ఉపక్రమించాలి. లేకుంటే అవి రోడ్లకు అడ్డంగా ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. హైదరాబాద్‌తో అనుబంధం ఉన్న వారిని, రాజకీయ పార్టీలను కూర్చోబెట్టి ఈ సమస్యలపై చర్చించాలి. రోడ్డు మధ్యలో ఉన్న ప్రార్థనా స్థలాలు, దర్గాల తొలగింపు అనివార్యం కావాలి. నగర సుందరీకరణలో వీటి తొలగింపు అత్యంత ముఖ్యం. అలాగే నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి. డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి. వర్షం వస్తే కాలనీలు మునిగే పరిస్థితి రాకుండా చూసుకోవాలి. ఈ క్రమంలో బడ్జెట్ ప్రతిపాదనలను చూశాక హైదరాబాద్ రూపురేఖలు మారబోతున్నాయి. ఇప్పటికే శివారు ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయి. తెలంగాణకు మణిహారమైన హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో నగర అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించారు. శంషాబాద్ విమానాశ్రయం వరకూ మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు, రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు రూ.1,525 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, హైడ్రా సంస్థకు రూ.200 కోట్లు, మెట్రో వాటర్ వర్క్స్‌కు రూ.3,385 కోట్లు కేటాయించారు. నగరంలో పారిశుద్ధ్య, మురుగు, నీటి, తాగునీటి సమస్యలు గత పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైనట్లు భట్టి విమర్శించారు. భాగ్యనగరాన్ని మరింత ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కేటాయింపులు ఇంతగా గతంలో ఎప్పుడూ జరగలేదు. దీనికితోడు మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణతో నగర రూపురేఖలు మారుతాయి. పట్టణ విపత్తుల నివారణకు, వాటిని ఎదుర్కొన డానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయాన్ని చేస్తుంది. ఈ సంస్థలో ఆస్తుల పరిరక్షణకు, విపత్తుల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు ఉంటాయి. బడ్జెట్‌లో హైడ్రా సంస్థకు రూ.200 కోట్లు కేటాయించారు. దీంతో ఇప్పుడు హైడ్రా తన పనిని వేగంగా చురుకుగా చేపట్టడానికి వీలవుతుంది. అలాగే అన్యాక్రాంతం అయిన భూములను పరిరక్షించేందుకు వీలవుతుంది. ఇకపోతే ప్రధానంగా నగరంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు శివారు ప్రాంతాలు విస్తరించి, నగరంలో కలిసి పోవడం, పట్టణీకరణ విషయంలో క్రమపద్ధతి లేకపోవడంతో నగరం నరకకూపంగా మారుతోంది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీల పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం చెందుతుంది. అలాగే, నదీ తీర ప్రాంతంలో క్రొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు వెలిసి, పాత హెరిటేజ్ ప్రాంతాలు క్రొత్తదనాన్ని సంతరించుకుంటాయి. ఈ ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో రూ.1500 కోట్లు ప్రతిపాదించడం ఆహ్వానించదగ్గ పరిణామంగా చూడాలి. ఇకపోతే జిహెచ్ఎంసి పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.3,065 కోట్లు కేటాయింపు కూడా కలసి రానుంది. ఎయిర్ పోర్ట్ వరకూ మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, ఓఆర్ఆర్‌కు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, పాత నగరానికి మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌కు రూ.50 కోట్లు కేటాయింపు జరిగింది. ఇవన్నీ కూడా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేవే. ఇకపోతే నగరంలో విలువైన భూములు అన్యాక్రాంతం అయినా గత పదేళ్లుగా పట్టింపు లేకుండా పోయింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములు ఏ విధంగానైతే అన్యాక్రాంతమయ్యాయో, స్వరాష్ట్రంలో దానికి రెట్టింపు భూ విధ్వంసం జరిగింది. ఆనాటి గొలుసుకట్టు చెరువులు చాలా మాయం చేసి, కొండలు, గుట్టలను పిండి చేసి రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చేసి అమ్మేశారు. గత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములకు రక్షణగా ఉండే వీఆర్ఓ, వీఆర్ఏలను రెవెన్యూశాఖ నుంచి దూరం చేయడంతో కబ్జాలకు ప్రభుత్వమే ఉసిగొలిపినట్ట య్యింది. అధికార అండతో విలువైన భూములను కాజేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో జరిగిన భూ విధ్వంసంపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త ఆలోచన చేసి, హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ హైడ్రా అనే ఓ ప్రత్యేక విభాగాన్నే ఏర్పాటు చేశారు. బడ్జెట్‌లో 'హైడ్రా'కు 200 కోట్ల రూపాయల కేటాయింపు ప్రభుత్వ సంకల్ప శుద్ధికి నిదర్శనం. జీహెచ్ఎంసీ పరిధిని ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరిం చేందుకు సీఎం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నందున, జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ వరకు ఉన్న ప్రాంతాలు హైడ్రా పరిధిలోకి రానున్నాయి. సుమారు 2 వేల చదరపు కిలోమీటర్లు, 27 మునిసిపాలిటీలు, 33 పంచాయ తీలను కలుపుకొని స్వయం ప్రతిపత్తితో ఉండేలా హైడ్రాను అందుబాటులోకి తెచ్చారు. చెరువుల కబ్జాలకు అడ్డుకట్ట వేయడం, ప్రభుత్వ స్థలాల పరిరక్షించడం, అక్రమ నిర్మాణాలను నియంత్రించడంలో ప్రధాన భూమికను పోషించనుంది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో పాటు విపత్తుల నిర్వహణలోనూ అది కీలకం. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో వేలాది ఎకరాల ప్రభుత్వ, చెరువు, వక్ఫ్, దేవాదాయశాఖ, పార్కులు, ఇనాం భూములు కబ్జాదారుల చెరల్లో ఉన్న విషయం తెలిసిందే. గత కొన్నేళ్లుగా ఈ ఆక్రమణలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇంకా చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములు కబ్జాల పాలవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కబ్జాదారుల బారి నుంచి సర్కారు భూములకు విముక్తి కల్పించడంతోపాటు ఇకముందు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా నిరోధించడం కోసం సరికొత్తగా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను అందుబాటులోకి తెచ్చింది.

# షర్మిల నుంచి వైసీపీకి ముప్పు



విజయవాడ, జూలై 26 వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి నిన్నటి వరకూ జాతీయ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీకి హార్డ్ కోర్ సపోర్టర్‌గా ఉన్నారు. స్పీకర్ అభ్యర్థిని నిలబెడితే అడగకుండానే మద్దతిచ్చారు. టీడీపీ, జనసేన ఉన్నందున ఎన్డీఏ కూటమికి మద్దతివ్వడం ఎందుకన్న ఆలోచన చేయలేదు. అంశాల వారీగా తమ మద్దతు బీజేపీకి ఉంటుందన్నారు. రెండు రోజుల కిందట విజయసాయిరెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కూడా కలిశారు. అయితే హఠాత్తుగా బుధవారం సీన్ మారిపోయింది. జగన్ కోసం ఇండీ కూటమి నేతలంతా తరలి వచ్చారు. మద్దతు పలికారు. అందరూ ఇండియా కూటమిలోకి రావాలని జగన్ కు ఆహ్వానం పలికారు. ప్రజాదర్బార్ ప్రారంభిస్తానని చెప్పిన రోజున జగన్ కాలు నొప్పికి చికిత్స కోసం అని బెంగళూరు వెళ్లిపోయారు. వారం రోజుల తర్వాత వినుకొండలో జరగి?న ఓ హత్య ఘటనను రాజకీయంగా మార్చేసి.. ఏపీలో అరాచకాలపై ఢిల్లీలో ధర్నా ప్రకటించేశారు. కలసి వచ్చే పార్టీలను కలుపుకుంటామని ప్రకటించారు. జగన్ ఢిల్లీలో ధర్నా చేయగానే ఇండీ కూటమి నేతలంతా ఒకరి తర్వాత ఒకరు వచ్చి మద్దతు పలికారు. అంటే. .. జగన్ ఢిల్లీలో ఉన్న సమయంలోనే ఇండీ కూటమిలో చేరికపై చర్చలు జరిగాయని ఆ ఫలితంగానే.. ఢిల్లీ ధర్నా ప్రణాళిక రూపుదిద్దుకుందని భావిస్తున్నారు.

మొత్తంగా జగన్మోహన్ రెడ్డి బుధవారం నుంచి అనధికారికంగా ఇండీ కూటమి మిత్రపక్షంగా మారారు. పార్లమెంట్ సమావేశాలకు ము?ందు ఆల్ పార్టీ మీటింగ్‌లో విపక్షాలుక డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేసినట్లుగా ప్రచారం జరిగింది. ఇవన్నీ వైసీపీ ప్రణాళికా బద్దంగా చేసుకుంటూ వచ్చిన రాజకీయం అనుకోవచ్చు. జగన్మోహన్ రెడ్డి ఇప్పటికిప్పుడు ఇండీ కూటమికి దగ్గరవడానికి కారణం షర్మిల అని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. షర్మిల ఏపీ పీసీసీ చీఫ్ గా ఉన్నారు. వైఎస్ వారసురాలిగా ఆమె తనదైన రాజకీయం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాయలసీమలో పలు చోట్ల వైసీపీ అభ్యర్థులు ఓడిపోవడానికి కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఓట్లే కారణం. 2019 ఎన్నికల్లో అసలు కాంగ్రెస్ పోటీ చేసిందో లేదో ఎవరికీ తెలియదు. కానీ షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పోటీ చేయడంతో రాయలసీమలో ముస్లిం మైనార్టీలు, దళితుల ఓట్లు కాంగ్రెస్ వైపు వెళ్లాయి. జగన్మోహన్ రెడ్డి బీజేపీకి దగ్గరయ్యారని ఆ పార్టీతో అనధికారిక పొత్తులు పెట్టుకున్నారని నేరు?గానే షర్మిల విమర్శిస్తున్నారు. జీవితాంతం కాంగ్రెస్ తో ఉన్న వైఎస్‌కు.. బీజేపీతో నడుస్తున్న జగన్ రాజకీయ వారసుడు కాలేరని అంటున్నారు. అదే సమయంలో బీజేపీతో దగ్గరగా ఉన్నట్లుగా కనిపించడం వల్ల దళితులు, మైనార్టీలు జగన్ పై అసంతృప్తిగా ఉన్నారు. వారందర్నీ కాంగ్రె?స్ వైపు మళ్లించేందుకు షర్మిల తన వంతు ప్రయత్నాలను గట్టిగా చేస్తున్నారు. షర్మిల రాజకీయంలో జగన్ కన్నా షార్ప్ గా ఉన్నారని రాజకీయవర్గాలు ఇంతకు ముందే తేల్చాయి. ఆమెకు ప్రత్యేకంగా సలహాదారులు అవసరం లేదు.. స్క్రిప్టు అవసరం లేకుండా రాజకీయ ప్రసంగాలు ఇస్తున్నారు. సమస్యలపై చురుగ్గా స్పందిస్తున్నారు. బీజేపీతో వైసీపీ సంబంధాలు ఇలాగే కొనసాగితే.. దళిత , మైనార్టీ ఓటు బ్యాంక్ కాంగ్రెస్ వైపు వెళ్లిపోతుందని అంటున్నారు. అదే జరిగితే వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగులుతుంది. మరోసారి అధికారంలోకి రావాలన్న కల నెరవేరదు. అందుకే జగన్ వ్యూహాత్మకంగా ఇండీ కూటమి వైపు మొగ్గుతున్నారని భావిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ఇంత కాలం బీజేపీకి దగ్గరగా ఉండటానికి



కారణం ఆయన వెనుక ఉన్న కేసుల లగేజీ అని ఎక్కువ మంది భావిస్తున్నారు. బీజేపీ కన్నెర్ర చేస్తే ఆయన బెయిల్ రద్దవుతుందని..కేసుల్లో విచారణ వేగం పుంజుకుంటుందని చెబుతారు. అంతేనా వివేకా హత్య కేసులో సీబీఐకి ఇంకా ఫ్రీ హ్యాండ్ ఇస్తే ఆయన పేరు కూడా బయటకు వచ్చే ప్రమాదం ఉందని చెబుతారు. ఇక అధికారం పోయినందున టీడీపీ ప్రభుత్వం ఇసుక, లిక్కర్ స్కాంలతో పాటు జరిగిన అనేక ఆర్థిక అవకతవకల్ని వెలికి తీసేందుకు రెడీ అవుతోంది. తమ పార్టీని భూస్థాపితం చేస్తామని చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. అలాంటివి ఏదో ప్రణాళికలు ఉన్నాయని జగన్ గట్టిగా నమ్ముతున్నారు. అందుకే బీజేపీతో దగ్గరగా ఉండటం కన్నా.. ఇండీ కూటమికి దగ్గరవడం వల్ల.. వచ్చే పరిణామాలను ఎదుర్కోవచ్చని అనుకుంటున్నారని భావించవచ్చు. ఆయా పార్టీలు తనకు మద్దతివవడంతో పాటు ప్రజల్లో సానుభూతి కూడా వస్తుందని అనుకుంటున్నారని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. భారీ ఓటమితో భవిష్యత్ లో తాను ఎదుర్కోబోయే గడ్డు పరిస్థితులపై జగన్ మోహన్ రెడ్డికి అవగాహన ఉంది. వాటిని ఎదుర్కోవడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నరని అనుకోవచ్చు.

## స్థానిక సంస్థల కోసం చట్టం మార్పు

విజయవాడ, జూలై 26, :ఏపీలో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులవుతోంది. దీంతో పాలనాపరమైన నిర్ణయాలతో పాటు రాజకీయ అంశాలపై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. ముఖ్యంగా శాసనమండలితో పాటు రాజ్యసభలో ఇప్పటికీ వైసీపీకి ఆధిక్యత ఉంది. మరోవైపు స్థానిక సంస్థల్లో కూడా వైసిపి ప్రాతినిధ్యం ఉంది. దీనిని ఎలాగైనా అధిగమించాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.స్థా నిక సంస్థలకు సంబంధించి చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే కనీసం నాలుగేళ్ల కాలం అనివార్యం. అప్పట్లో దీనిపై జగన్ సర్కార్ చట్టం చేసింది. ఇప్పుడు స్థానిక సంస్థలను కైవసం చేసుకోవాలంటే చట్ట సవరణ చేయాలి. అందుకే కూటమి ప్రభుత్వం పావులు కదుపుతోంది. చట్ట సవరణకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఏకపక్ష విజయం సాధించింది. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల్లో స్వీప్ చేసింది. కార్పొరేషన్ లో తోపాటు మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది. రాష్ట్రంలో ఒక తాడిపత్రి మున్సిపాలిటీ తప్ప.. మిగతావన్నీ వైసిపి ఖాతాలో పడ్డాయి. ఇప్పుడు వైసీపీ అధికారానికి దూరమైంది. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో విశాఖ నగరపాలక సంస్థతో పాటు చాలా కార్పొరేషన్లలో కార్పొరేటర్లు టిడిపి తో పాటు జనసేనలో చేరారు. పుంగనూరు, చిత్తూరు వంటి చోట్ల కౌన్సిలర్లు సైతం పెద్ద ఎత్తున టిడిపిలో చేరారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ప్రతినిధులు ఎక్కువమంది కూటమి పార్టీలో చేరారు. అక్కడ అధ్యక్ష స్థానాలు దక్కించుకోవాలంటే తప్పనిసరిగా అవిశ్వాస తీర్మానం పెట్టాలి. కానీ అందుకు మరో రెండేళ్ల పాటు ఆగాల్సి ఉంటుంది. అందుకే కూటమి ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. అవిశ్వాస తీర్మానానికి సంబంధించి చట్ట సవరణ చేయాలని భావిస్తోంది. అది జరిగితే రాష్ట్రంలోని చాలా వరకు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు, జిల్లా పరిషత్తులు టిడిపి చేతిలోకి వస్తాయిమున్సిపల్ కార్పొరేషన్ లకు సంబంధించి గ్రేటర్ విశాఖ టిడిపి కూటమి వశమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే వైసీపీకి చెందిన 12 మంది కార్పొరేటర్లు టిడిపి, జనసేనలో చేరారు. ఏడుగురు టిడిపిలో చేరగా, మరో అయిదుగురు జనసేనలో చేరారు. దీంతో కూటమి బలం పెరిగింది. గ్రేటర్ విశాఖలో 98 కార్పొరేట్ స్థానాలు ఉన్నాయి. వైసీపీకి 58, టిడిపికి 29 మంది సభ్యుల బలం ఉంది. జనసేన మూడు చోట్ల గెలిచింది. బిజెపి, సిపిఎం, సిపిఐ ఒక్కోచోట గెలిచాయి. నలుగురు ఇండిపెండెంట్ లు గెలిచారు. అయితే గ్రేటర్ విశాఖపట్నం పరిధిలోని ఎమ్మెల్యే, ఎంపి స్థానాలను కూటమి ఏకపక్షంగా గెలుచుకుంది. ఇప్పుడు చేరిన 12 మంది కార్పొరేటర్లతో పాటు ఎంపీ,ఎమ్మెల్యేల ఓట్లతో గ్రేటర్ విశాఖ మున్సిపల్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకునే ఛాన్స్ కనిపిస్తోంది.వైసీపీ హయాంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ హోరాహోరీగా తలపడింది. అయితే మున్సిపల్ ఎన్నికల సమయంలో వైసిపి విధ్వంస ఘటనలకు తెరతీసింది. అప్పట్లో బలవంతంగా ఏకగ్రీవాలు చేసుకుంది. దీంతో టీడీపీకి ఓటమి ఎదురైంది. ఒక్క తాడిపత్రి మున్సిపాలిటీని మాత్రమే తెలుగుదేశం పార్టీ గెలుచుకుంది. తరువాత వచ్చిన ప్రాదేశిక ఎన్నికలను తెలుగుదేశం పార్టీ బహిష్కరించింది. దీంతో దాదాపు రాష్ట్రంలోని అన్ని మండలాలు, జిల్లా పరిషత్తులను వైసిపి కైవసం చేసుకుంది. అవిశ్వాస తీర్మానం నాలుగేళ్లు పూర్తయితే కానీ పెట్టలేని విధంగా ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఒక్క జిల్లా పరిషత్ సైతం చేతిలో లేదు. మెజారిటీ మండల పరిషత్తులు సైతం వైసీపీ చేతిలోనే ఉన్నాయి. దీంతో పాలనతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించి ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంది. పైగా చాలామంది స్థానిక ప్రజాప్రతి నిధులు ఎన్నికలకు ముందే కూటమి పార్టీల్లో చేరారు. ఇప్పుడు ఎన్నికల తరువాత కూడా చాలామంది పార్టీల్లో చేరుతున్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు టిడిపి శ్రేణులకు ఇబ్బంది పెట్టని వారికి మాత్రమే పార్టీలోకి తీసుకుంటున్నారు. జనసేన సైతం అదే ఫార్ములాను అనుసరిస్తోంది. అయితే శాసనసభలో చట్ట సవరణ చేసి.. స్థానిక సంస్థల్లో అవిశ్వాస తీర్మానం చేయాలని టిడిపి తో పాటు జనసేన నిర్ణయం తీసుకున్నాయి.

## నది ఒడ్డున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే. డాక్టర్. బి.వి. జయనేశ్వర్ రెడ్డి వెల్లడి



ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు నియోజవర్గంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే. డాక్టర్. బి. వి. జయనాగేశ్వర్ రెడ్డి ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం మండలంలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు , ప్రజాప్రతినిధులకు సూచన.ఈరోజు మనకు తుంగభద్ర డ్యాం నుండి 90 వేల క్యూసెక్కుల నీటిని 28 గేట్ల ద్వారా వదిలారని తుంగభద్ర డాం అధికారులు తెలిపిన మేరకు ముందు జాగ్రత్తగా చర్యలో భాగంగా మననియోజకవర్గం లోని నది పరివాహక ప్రాంతమైన నందవరం మండలంలోని గ్రామాలలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మీ గ్రామాలలో ప్రజలను అప్రమత్తం చేస్తూ దండోరా వేయించవలసిందిగా. ఎమ్మెల్యే. డాక్టర్. బి. వి. జయనగేశ్వర్ రెడ్డి ఆదేశించారు.నదీ పరివాహ గ్రామాలు అనగా నదీ కైరవడి,గంగవరము, జోహారాపురం,పెద్దకొత్తిని, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాలలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ పశువులను ఇంటి దగ్గరే ఉండేలా చూసుకొని, ఇంటి నుండి చిన్న పిల్లలు ఈతకు, పెద్దలు ఆడవారు బట్టలు ఉతకడానికి వెళ్లకుండా ఉండవలసిందిగా మనవి. ఈ విషయాలను ఆ గ్రామాలకు సంబంధించిన విఆర్వోలు, పంచాయతి సెక్రటరీలు, సర్పంచులు, గ్రామ పెద్దలు దండోరా వేయించాల్సిందిగా ఆదేశించడం అయినది.

## నామినేటెడ్ పదవుల కోసం నయా ఫార్ములా

విశాఖపట్టణం, జూలై 26, ఏపీలో నామినేటెడ్ పదవుల నియామకంపై కసరత్తు ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులవుతోంది. దీంతో పాలనాపరమైన నిర్ణయాల్లో సీఎం చంద్రబాబుతో పాటు పవన్ బిజీగా ఉన్నారు. కూటమి అధికారంలోకి రావడానికి కష్టపడిన నేతలకు, కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలని భావిస్తున్నారు. సుదీర్ఘకాలం మూడు పార్టీల మధ్య పొత్తు కొనసాగాలని ఆకాంక్షిస్తున్న నేపథ్యంలో.. అందుకు అనుగుణంగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఏ పార్టీకి ఎన్ని పదవులు ఇవ్వాలి? ఎవరెవరికి ఏ పదవులు కేటాయించాలి? అనే అంశాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ ఎన్నికల్లో కూటమి 164 స్థానాల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. తెలుగుదేశం పార్టీ 135 స్థానాల్లో గెలుపొందింది. 21 స్థానాల్లో పోటీ చేసిన జనసేన శత శాతం విజయం సొంతం చేసుకుంది. పది స్థానాల్లో పోటీ చేసిన బిజెపి 8 చోట్ల గెలిచింది. మూడు పార్టీల మధ్య పొత్తు కుదరడంతో.. చాలాచోట్ల నేతలకు టిక్కెట్లు దక్కలేదు. అటువంటి వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు అటువంటి వారిని గుర్తించి పదవులు ఇవ్వాలని మూడు పార్టీలు డిసైడ్ అయ్యా యి. కూటమిలో అతిపెద్ద పార్టీగా టిడిపి ఉంది. క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి క్యాడర్ ఉంది. జనసేన సైతం ఆవిర్భవించి సుదీర్ఘ కాలమ వుతోంది. గత పది సంవత్సరాలుగా పార్టీ వెన్నంటి నడిచిన నాయ కులు చాలామంది ఉన్నారు.బిజెపిలో సైతం సీనియర్లు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు.ఆ పార్టీకి 10 శాసనసభ సీట్లు, ఆరు పార్లమెంట్ స్థానాలు దక్కడంతో.. చాలామంది నేతలకు టికెట్లు దక్కలేదు. అటువంటివారు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం మూడు పార్టీల్లో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారు వందలాదిమంది ఉన్నారు. వారి సీనియార్టీని, సిన్సియార్టీని ప్రాతిపదికగా తీసుకోనున్నారు.నామినేటెడ్ పదవుల విషయంలో మూడు పార్టీలు ఒక ఫార్ములాను అనుసరించనున్నట్లు తెలుస్తోంది. టిడిపి ఎమ్మెల్యేలు ఉన్నచోట ఆ పార్టీకి 60 శాతం, జనసేనకు 30 శాతం, బిజెపికి 10% పదవులు కేటాయించనున్నారు. జనసేన ఎమ్మెల్యేలు ఉన్నచోట ఆ పార్టీకి 60 శాతం, టిడిపికి 30 శాతం, బిజెపికి మిగతా శాతం పదవులు కేటాయించనున్నారు. బిజెపి ఎమ్మెల్యే ఉన్నచోట 50 శాతం ఆ పార్టీకి, మిగతా శాతం టిడిపి, జనసేనలకు పదవులు కేటాయించనున్నట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో దాదాపు 100 వరకు కుల కార్పొరేషన్లు ఉన్నాయి. వీటికి తోడు సలహాదారుల పదవులు కూడా ఉన్నాయి. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టులు సైతం ఉన్నాయి. టీటీడీ చైర్మన్ వంటి అత్యుత్తమ పదవులు కూడా ఉన్నాయి. వీటి విషయంలో కూడా మూడు పార్టీల మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ ఐ.వి.ఆర్.ఎస్ పద్ధతిలో సర్వే చేస్తోంది. పార్టీలో సీనియర్లు ఎవరు?

వారి పనితీరును తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది. జనసేన సైతం పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందించిన వారు వివరాలు సేకరించే పనిలో పడింది. బిజెపి సైతం పార్టీ శ్రేణుల నుంచి వివరాలు సేకరిస్తోంది.తాజాగా టీటీడీ బోర్డు పూర్తిగా రద్దయింది. మొత్తం 26 మంది సభ్యులు రాజీనామా చేశారు. టీటీడీ అధ్యక్ష పీఠం ఎవరికి ఇస్తారు అన్నది తెలియాల్సి ఉంది. వీలైనంతవరకు ఆ పోస్టును తెలుగుదేశం పార్టీ తీసుకోవాలని చూస్తోంది. టీటీడీ బోర్డు సభ్యుల విషయంలో మాత్రం మూడు పార్టీలకు భాగస్వామ్యం కల్పించనుంది. అయితే నామినేటెడ్ పదవుల విషయంలో మూడు పార్టీలు ఒక నిర్ణయానికి వచ్చాయి. కొత్తగా చేరిన వారి కంటే.. ఎప్పటినుంచో ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నాయి. అయితే ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం బట్టి పదవుల శాతాన్ని విభజిం చడంతో.. ఒక పార్టీ విషయంలో మరో పార్టీ కలుగజేసుకోకూడదని ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే వైసీపీ నుంచి చేరికల విషయంలో మాత్రం మూడు పార్టీలు ఒక నిర్ణయానికి రావాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఆ తరువాతే చేరికలకు ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## వైసీపీలో మొదలైన రాజీనామాల పర్వం

అమరావతి వైకాపా లో అసంతృప్తిగా ఉన్న నేతలు.. జగన్ నాయకత్వంపై విశ్వాసం లేని నేతలంతా వైసీపీకి గుడ్బై చెబుతున్నారు. గత వారం రోజులుగా జిల్లా స్థాయి నాయకులు ఎందరో వైసీపీకి దూరమవుతున్నారు. తాజాగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు వైసీపీకి రాజీనామా చేయగా, తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాస్థాయిలో కీలక నేతలు పార్టీకి దూరమవుతున్నారు. పార్టీ బలోపేతంపై వైసీపీ అధినేత జగన్ దృష్టిపెట్టకపోవడం, కిందిస్థాయి క్యాడర్ను పట్టించుకోకపోవడంతోనే వైసీపీ నాయకులు పార్టీని వీడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు సైతం నచ్చకపోవడంతోనే వైసీపీకి నేతలు గుడ్బై చెబుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ఇద్దరు కీలక నాయకులు వైసీపీకి రాజీనామా చేశారు. వాస్తవానికి చాలామంది నాయకులు వైసీపీని వదిలి ఇతర పార్టీల్లో చేరాలనే అభిప్రాయంతో ఉన్నప్పటికీ ఇతర పార్టీల నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో వెయిట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కసారి టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి సిగ్నల్ వస్తే మాత్రం వైసీపీ నుంచి భారీగా వలసలు ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.ఏలూరులో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. వైఎస్సార్సీపీ ఏలూరు నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆయనతో పాటు పార్టీ ఏలూరు జిల్లా కోశాధికారి, ఏలూరు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మంచెం మైబాబు కూడా రాజీనామా చేశారు. ఈ ఇద్దరు నేతలు గత కొంతకాలంగా వైసీపీలో కీలకంగా పనిచేశారు. ముఖ్యమైన ఇద్దరు నేతలు పార్టీని వీడటంతో వీరితో పాటు వీళ్ల అనుచరులు సైతం వైసీపీకి దూరం కానున్నారు. మరికొందరు సీనియర్లు సైతం జిల్లాలో వైసీపీకి రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ పార్టీ విధి, విధానాలు నచ్చకపోవడంతోనే శ్రీనివాస్, మైబాబు రాజీనామా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరు నేతల రాజీనామా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశాలు ఉండవచ్చు

# సోషల్ మీడియాలో ఈవీఎం ప్రొడక్షన్స్....

## తెరపైకి కొత్త వాదనలు

నెల్లూరు, జూలై 26, ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఈవీఎంల పనితీరు, వాటిని హ్యాకింగ్ చేసి ఫలితాలను తారుమారు చేయవచ్చున్న బలమైన చర్చ నడుస్తోంది. ఇప్పటికే అభివృద్ధి చెందిన చాలా దేశాలు ఈవీఎంలను నిషేధించాయి. బ్యాలెట్ రూపంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నాయి. మనదేశంలో కూడా ఈవీఎంల పనితీరుపై అనుమానాలు ఉన్నాయి. కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి రావడానికి ఈవీఎంల హ్యాకింగ్ కారణమని విపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మొన్నటికి మొన్న ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏకపక్ష విజయాన్ని సొంతం చేసుకుంది. 175 స్థానాలకు గాను 164 చోట్ల కూటమి అభ్యర్థులు గెలిచారు. తెలుగుదేశం ఒంటరిగా 135 స్థానాలు విజయం సాధించింది. 21 చోట్ల జనసేన, 8 చోట్ల బిజెపి అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. వైసిపి కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. వై నాట్ 175 అన్న నినాదంతో బరిలో దిగిన వైసీపీ దారుణ పరాజయాన్ని చవిచూసింది. హేమహేమీలు, బలమైన నియోజకవర్గాలను సైతం వదులుకోవాల్సి వచ్చింది.అప్పుడే మరోసారి ఈవీఎంల హ్యాకింగ్ అంశం తెరపైకి వచ్చింది. ఇన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన తర్వాత కూడా ప్రజలు తిరస్కరించాలంటే అనుమానంగా ఉందని జగన్ కామెంట్స్ చేశారు. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రెడ్డి అయితే ఓ ఛానల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హ్యాకింగ్ చేశారని తేల్చేశారు. దాదాపు వైసీపీ నేతలంతా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీనికి కౌంటర్ ఇచ్చింది టిడిపి. 2019లో వైసీపీకి 151 స్థానాలు లభించాయి.అప్పుడు కూడా ఈవీఎంలను హ్యాకింగ్ చేశారా అంటూ ప్రశ్నించింది టిడిపి. దీంతో సోషల్ మీడియాలో ఇదో ఆసక్తికర అంశంగా మారింది.తెలుగు సినిమా రంగంలో ఏవీఎం ప్రొడక్షన్స్ కు మంచి పేరు ఉంది. తాజాగా ఈవీఎం ప్రొడక్షన్ అంటూ సోషల్ మీడియాలో వీడియోలు కనిపిస్తున్నాయి.అందులో సైకిల్ గుర్తు వేసి.. ఈవీఎంల హ్యాకింగ్ ద్వారా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగలిగింది అంటూ రూపొందించిన వీడియో ఆకట్టుకుంటుంది. టిడిపి అనుకూల మీడియాలో డిబేట్లను అందులో పొందుపరిచారు. సంపూర్ణ విజయం ఎలా దక్కిందని ప్రజలు తనను అడుగుతున్నారని పవన్ చేసిన వ్యాఖ్యలను సైతం జత చేశారు. ఆ విజయం పై పవన్ కే నమ్మకం లేదన్నట్టు వీడియో దృశ్యాలను అందులో పొందుపరిచారు. అయితే అందులో విశేషమేమిటంటే..అవన్నీ 2019 ఎన్నికల ఫలితాల సమయంలో టిడిపి శ్రేణులు, అనుకూలమైన వారు ఈవీఎంల ట్యాంపరింగ్ పై అనుమానం వ్యక్తం చేసిన వీడియోలతో దానిని రూపొందించడం విశేషం.వాస్తవానికి ఈవీఎంల టెంపరింగ్ ఎప్పటినుంచో అనుమానాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా టిడిపి గళమెత్తిన సంగతి తెలిసిందే. ఆ ఎన్నికల్లో జాతీయస్థాయిలో బిజెపికి బంపర్ మెజారిటీ వచ్చింది. ఏపీలో వైసీపీ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. టిడిపి ఘోరంగా ఓడిపోయింది. ఆ సమయంలో సైతం చంద్రబాబుతో పాటు టిడిపి శ్రేణులు ట్యాంపరింగ్ చేసిందన్న అనుమానాలు వ్యక్తం చేశారు.2024 ఎన్నికల్లో బిజెపికి బలం తగ్గింది. కానీ పెద్ద పార్టీగా అవతరించింది. ఏపీలో సైతం కూటమి బంపర్ మెజారిటీ సాధించింది. ఎక్కడైతే బిజెపి గెలిచిందో.. అటువంటి చోట ట్యాంపరింగ్ జరిగిందన్న కామెంట్స్ వినిపించాయి. ఎక్కడైతే విపక్షాలు గెలిచాయో ఆ మాట వినిపించలేదు. ఏపీలో బిజెపితో కలిసి నడిచిన కూటమి భారీ మెజారిటీ సాధించింది. అందుకే వైసిపికి ఇదో ప్రచార అస్త్రంగా మారింది. కానీ ప్రజల్లో మాత్రం ఒక రకమైన అభిప్రాయం నెలకొంది. ఓడిపోతే ఈవీఎంలపై ట్యాంపరింగ్ అనుమానం.. గెలిస్తే ప్రజలపై తమ నమ్మకం అన్నట్టు పార్టీలు వ్యవహరిస్తాయని ప్రజలు ఒక స్థిరమైన అభిప్రాయానికి వచ్చారు.

# హీట్ పుట్టిస్తున్న ఎంక్వయిరీలు

విజయవాడ, జూలై 26, ఏపీ గట్టుపై ఇప్పుడు ఎంక్వైరీల టైమ్ హీట్ పుట్టిస్తోంది.ప్రభుత్వం మారింది.. మంత్రులంతా రివ్యూలతో ఆఫీస్‌లకే పరిమితమయ్యారు. ఆ సమయంలో కృష్ణాజిల్లా యనమలకుదురు కట్టపై ప్రభుత్వ రికార్డులు తగలబెట్టిన ఘటన సంచలనం రేపింది. స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కొంతమందిని పోలీసులకు అప్పగించారు. పీసీబీ, మైనింగ్ ఫైళ్లు కాలిబూడిదయ్యాయి. ఉన్నపళంగా కట్టపై ఎందుకిలా చేశారన్నది అంతుబట్టలేదు.యనమలకుదురు కట్టపై ఫైళ్ల దగ్ధం ఘటన మరువకముందే.. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంటలు చెలరేగాయి. రాత్రి పదకొండున్నర గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో కీలక కంప్యూటర్లు, దస్త్రాలన్నీ కాలిపోయాయి. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆర్డీవో హరి ప్రసాద్‌తో పాటు 37 మంది సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారించారు. కాల్‌డేటాపైనా ఆరాతీశారు. చుక్కల భూములు, 22ఏ ల్యాండ్స్, రిజర్వాయర్లకు సంబంధించిన భూములు, అసైన్మెంట్ ల్యాండ్స్‌కి సంబంధించిన రికార్డులన్నీ భద్రంగా ఉన్నాయా? లేదా? అన్నది తేల్చే పనిలో పడ్డారు. సెలవు రోజున ఎవరి ప్రమేయంతో.. ఎందుకిలా చేశారన్నది మిస్టరీగా మారింది. ఈ ఎపిసోడ్‌పై డీజీపీ, సీఐడీ చీఫ్‌తో సహా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో పాటు డీఎస్పీలు, సీఐలతో కేసు వివరాలపై ఆరా తీస్తున్నారు.ప్రభుత్వం మారిన వెంటనే ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు గుంటూరులోని నగరం పాలెం పోలీసుల్ని ఆశ్రయించారు. గత ప్రభుత్వ హయాంలో రాజద్రోహం చట్టం కింద అరెస్టు చేసి వేధించారని ఆరోపించారాయన. మాజీ సీఎం జగన్‌తో పాటు అప్పటి సీఐడీ డీజీ పీవీ సునీల్‌కుమార్, మరికొందరు అధికారులపై ఫిర్యాదు చేశారు. 2021 మే 14న తనపై హత్యాయత్నం చేశారని.. రబ్బర్ బెల్ట్, లాఠీలతో కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రఘురామ నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. హత్యాయత్నం, తప్పుడు నివేదికలు, భయభ్రాంతులకు గురిచేయడం లాంటి అంశాలకు సంబంధించి వేర్వేరు సెక్షన్లు పెట్టారు. వీటిలో బెయిల్‌బుల్, నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లు కూడా ఉన్నాయి. సిఐడి అధికారులపైనే కేసులు నమోదు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.ఇక వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం అక్రమాలపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. లోతైన విచారణ తరువాత ఈడీకి కూడా సిఫార్సు చేస్తామని.. అసెంబ్లీ వేదికగా ప్రకటించారు సీఎం చంద్రబాబు. మద్యం అక్రమాలపై అసెంబ్లీలో ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మద్యం ధరలు పెంచి వచ్చిన వేలాది కోట్ల రూపాయల సొమ్మును వైసీపీ నేతలు దోచుకుతిన్నారని ఆరోపించారు. పేదవాడి బలహీనతను ఆసరగా చేసుకుని నాణ్యత లేని లోకల్ బ్రాండ్లు తీసుకొచ్చారన్నారు. వాటిని విచ్చలవిడిగా విక్రయించి.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారని మండిపడ్డారు.మద్యం అక్రమాలపై సీఐడి విచారణలో ఏం తేలనుందన్నది ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఇదే అసెంబ్లీలోనే టీడీఆర్ బాండ్లపైనా చర్చ జరిగింది. రాష్ట్రంలో 2019 నుంచి 24 వరకూ 3306 టీడీఆర్ బాండ్స్ ఇచ్చారని.. దీనిపై శాఖాపరమైన చర్యలు, ఏసీబీ విచారణకు ఆదేశించామన్నారు మంత్రి నారాయణ.

# భార్య, భర్తలు - జేసీగా - ఎస్పీగా...!

ఏలూరు, జూలై 26 ఎందరో ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారు. కానీ ఏపీలో మాత్రం ఒక ఐఏఎస్, ఒక ఐపీఎస్ మాత్రం అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. ఎందుకంటే ఈ ఇద్దరు బ్యూరోక్రాట్లు ప్రేమించి వివాహం చేసుకుని ఒకటి కావడమే. మరీ ముఖ్యంగా వీరిద్దరూ ఒకేచోట ఏలూరు జిల్లాలో పనిచేస్తుండటమే మరింత మంది దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ ఇద్దరూ ఎవరో కాదు.. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిశోర్, ఏలూరు జాయింట్ కలెక్టర్ పెద్దిటి ధాత్రిరెడ్డి. వీరిలో కొమ్మి ప్రతాప్ శివ కిశోర్ ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు జిల్లాకు చెందిన వారు కాగా, ధాత్రి రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన తెలంగాణ అమ్మాయి. ధాత్రిరెడ్డి, కిశోర్.. ఇద్దరూ ఐఐటీ, ఖరగ్‌పూర్‌లో ఇంజనీరింగ్ చదివారు. విశాఖ ఏజెన్సీలో ఉద్యోగం చేస్తున్న సమయంలో ఒకర్నొకరు ఇష్టపడి గతేడాది చివర్లో వీరిద్దరూ వివాహం చేసుకున్నారు.కొమ్మి ప్రతాప్ శివ కిశోర్ 2019 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఆయన స్వస్థలం నెల్లూరు జిల్లా వరిపాడు మండలం చుంచులూరు గ్రామం. తండ్రి కొమ్మి నారాయణ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. తల్లి నిర్మల గృహిణి. చుంచులూరులోని జిల్లా పరిషత్ హైస్కూలులో ఒకటి నుంచి 8వ తరగతి వరకు చదువుకున్నారు శివ కిశోర్. నెల్లూరు జిల్లా కృష్ణాపురంలోని జవహర్ నవోదయ స్కూల్లో 9, 10వ తరగతులు చదివారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బయో టెక్నాలజీ, బయో కెమికల్ ఇంజనీరింగ్ పట్టా అందుకున్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన వెంటనే బెంగళూరులో ప్రముఖ సంస్థలో ఉద్యోగంలో చేరారు. సీనియర్ సైంటిస్ట్‌గా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌లో 4 ఏళ్లు పనిచేశారు. రీసెర్చ్ కన్సల్‌టెంట్, స్టూడెంట్ అడ్వయిజర్‌గానూ పనిచేశారు. ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. తొలి రెండు ప్రయత్నాల్లో సివిల్స్ రాలేదు. మూడోసారి పట్టుదలతో సాధించారు. 153వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2018లో హైదరాబాద్ సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అకాడమీలో శిక్షణ పూర్తిచేసుకున్న శివ కిశోర్‌కు కర్నూలు జిల్లాలో ట్రైనీ ఐపీఎస్‌గా తొలి పోస్టింగ్ ఇచ్చారు. ఎమ్మిగనూరు నుంచి ఆయన కెరీర్ ప్రారంభమైంది. ప్రతాప్ కిషోర్ .. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ఏఎస్పీగా పనిచేశారు. ఆ సమయంలోనే ప్రధాని సిల్వర్ కప్ అందుకున్నారు. సమర్థుడైన యువ అధికారిగా పేరు తెచ్చుకున్న ప్రతాప్ శివ కిషోర్ ను తాజాగా ప్రభుత్వం ఏలూరు జిల్లా ఎస్పీగా నియమించింది. పెద్దిటి ధాత్రిరెడ్డి తెలంగాణలోని యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం గుండ్లబావి గ్రామంలో జన్మించారు. ధాత్రిరెడ్డి విద్యాభ్యాసం హైదరాబాద్‌లో సాగింది. 2001 నుంచి హైదరాబాద్‌లోని జోసఫ్ పబ్లిక్ స్కూల్‌లో ఆమె చదివారు. ఎస్‌టీ ప్యాట్రిక్స్ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివారు. 2011 నుంచి 2015 వరకు ఐఐటీ, ఖరగ్‌పూర్‌లో ఇంజనీరింగ్ చేశారు. తొలుత ధాత్రిరెడ్డి కూడా ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2019లో ఐపీఎస్ సాధించి ఖమ్మం జిల్లాలో పనిచేశారు. ఐఏఎస్ సాధించాలనే పట్టుదలతో మళ్లీ పరీక్ష రాసి సివిల్స్‌లో 46వ ర్యాంకు సాధించారు. ఒడిశా కేడర్ అధికారిణిగా 2020 అక్టోబరులో సబ్ కలెక్టర్‌గా కెరీర్ ప్రారంభించారు. 2023లో ఏపీ కేడర్‌కు బదిలీ అయ్యారు ధాత్రిరెడ్డి. పాడేరు సబ్ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. అదే సమయంలో చింతపల్లి ఏఎస్‌పీగా కిశోర్ బాధ్యతలు చేపట్టారు. ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల ప్రాంతాల్లోనూ గొప్పగా పనిచేసి మంచి పేరు సంపాదించారు. ఈ సమయంలోనే ఒకర్నొకరు ఇష్టపడి, పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు.చింతపల్లి, పాడేరు పూర్తిగా ఏజెన్సీ ప్రాంతాలైనా ఇరువురికీ గ్రామీణ వాతావరణం నుంచి వచ్చిన నేపథ్యం, సేవా దృక్పథం ఉండటంతో ప్రజలతో చక్కగా కలిసిపోయారు. పేదలకు సాధ్యమైనంత సేవ చేయాలనేది ఈ జంట ఆలోచన. గిరిజనుల పిల్లలకు ప్రతి ఒక్కరికీ విద్య అందేలా వీరిద్దరూ చర్యలు తీసుకున్నారు.

పిల్లలను పాఠశాలలకు తప్పనిసరిగా పంపించేవిధంగా తల్లిదండ్రులను ఒప్పించడంలో విజయవంతం అయ్యారు. ధాత్రిరెడ్డి. చదువుకునే రోజుల నుంచే ఆమె సేవా కార్యక్రమాలపై ఎక్కువగా దృష్టి పెట్టే వారు. 2016లోనే ఫీడ్ ఇండియా అనే ఎన్‌జీవోను స్థాపించారు. హైదరాబాద్‌లో హోటళ్లలో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి, నిరుపేదలకు పంచి పెట్టేవారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏజెన్సీ ప్రాంతంలోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో గిరిజనులు ఆమెపై అభిమానం పెంచుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి గిరిజనులకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీరిద్దరూ అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అక్కడ వరదలు బీభత్సం సృష్టించాయి. ఇరువురు కలిసి వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలి, వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలో సమావేశాలు ఏర్పాటు చేసి వివరించారు. ప్రజల పట్ల మమకారం, వృత్తిపట్ల బాధ్యత, సమాజంపై అవగాహన ఉన్న ఈ జంట భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుందాం..

# గత ప్రభుత్వ హయాంలో ప్రకటన దోపిడీ

**సొంత పత్రికకు ప్రకటనల ద్వారా వందల కోట్లు**

**అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో టిడిపి సభ్యుల ఆందోళన**

**సభాసంఘం వేయాలన్న డిమాండ్ పరిశీలిస్తామన్న మంత్రి**

అమరావతి,జూలై26 వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రకటనల కుంభకోణంపై హౌస్ కమిటీ వేయాలని తెదేపా ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, తెనాలి శ్రవణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్ర, బెందాళం అశోక్ మాట్లాడారు. 2019–24 మధ్య రూ.850 కోట్ల మేర పత్రికల్లో ప్రకటనలకు ఖర్చు చేశారని.. దీనిలో పక్షపాత ధోరణి ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఏబీసీ (ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్) నివేదికకు విరుద్ధంగా గత ప్రభుత్వంలో పౌరసంబంధాల శాఖ అధికారులు వ్యవహరించారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి 15 రోజులకు తమకు కావాల్సిన పత్రికలు, మీడియాలో నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు ఇచ్చి అనుచిత లబ్ధి కలిగించారన్నారు. నాటి సీఎం జగన్ సతీమణి ఆధ్వర్యంలో నడిచిన సాక్షి పత్రికకు పెద్ద ఎత్తున ప్రకటనల డబ్బు చెల్లించారని ఆరోపించారు. అనంతరం సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దీనిపై వివరణ ఇచ్చారు. సభ్యుల డిమాండ్ మేరకు హౌస్ కమిటీ వేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ఈ అంశంపై స్పీకర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. 2019–24 మధ్య ప్రకటనల్లో పక్షపాత ధోరణి వాస్తవమేనని.. దీనిపై విచారణ జరిపిస్తామని వెల్లడించారు. ఒక్క సాక్షి పత్రికకే రూ.400కోట్ల మేర కేటాయించారని మంత్రి తెలిపారు.పత్రికలకు వైసీపీ ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చే విషయంలో భారీ కుంభకోణం జరిగిందని సమాచారశాఖ మంత్రి పార్థసారథి ఆరోపించారు. పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడంలో పక్షపాత ధోరణి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఒక్క సాక్షి పత్రికకే మొత్తం రూ. 420 కోట్ల అడ్వర్‌టైజ్‌మెంట్లు ఇచ్చారని, ఒక జీవోను అడ్డుపెట్టుకుని అధికారులు విచ్చలవిడిగా వ్యవహరించారని, స్పీకర్‌తో మాట్లాడి హౌస్ కమిటీ వేస్తామని మంత్రి స్పష్టం చేశారు. విజయకుమార్ రెడ్డిని రిలీవ్ చేయకుండా సీఎస్, ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని, అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరించారని తేలిందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. సర్క్యులేషన్ ప్రకారం కూడా అధికారులు వ్యవహరించలేదని, దీనిపై విచారణ చేసి.. వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. సమాచార శాఖ ప్రజలు కోసం కాకుండా... జగన్ కోసం పని చేసిందని, ప్రకటనల్లో చంద్రబాబును విమర్శించారని.. ఇటువంటి ధోరణి గతంలో లేదని నక్కా ఆనంద్ బాబు అన్నారు. సాక్షికి రూ. 390 కోట్లు ఇచ్చారని, అలాగే సర్క్యు లేషన్ లేని ఇంగ్లీష్ పత్రికలకు కోట్ల రూపాయలు దోచి పెట్టారని ఆరోపించారు. ఇంగ్లీష్ మీడియా ద్వారా ఎన్నికల్లో సర్వే చేయించారని, డిజిటల్ మీడియా ద్వారా వందల కోట్లు దోచి పెట్టారని, సాక్షి ఉద్యోగులను ఇందులో పెట్టారని విమర్శించారు. ఎ డ్రీమ్ అనే చెత్త ఛానల్‌ను తీసుకువచ్చి పదవి కట్టబెట్టారని, దేవేందర్ రెడ్డిని తీసుకువచ్చి చైర్మన్‌ను చేసి దోచి పెట్టారని నక్కా ఆనంద్ బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కొన్ని అనుకూల మీడియాలను అడ్డుపెట్టుకుని విచ్చలవిడిగా జగన్ వ్యవహరించారని, సచివాలయాలకు, వాలంటీర్లకు సాక్షి పేపర్లు కట్టబెట్టడం చేశారని, ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేశారని బెందాలం అశోక్ ఆరోపించారు. దీనిపై వెంటనే హౌస్ కమిటీ వేయాలని.. సొమ్మును రికవరీ చేయాలని ఆయన కోరారు. ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రిని డిపార్ట్‌మెంట్ తప్పుదోవ పట్టించిందని, సాక్షికి రూ. 292 కోట్లు, ఈనాడుకు రూ.190 కోట్లు, ఆంధ్రజ్యోతికి రూ. 21 లక్షల ప్రకటనలు ఇచ్చారని శ్రావణ్ కుమార్ అన్నారు. ఏబీసీ సర్క్యులేషన్ ప్రకారం చేయలేదని ఆరోపించారు. ఇది పెద్ద కుంభకోణమని...దీనిపై. వెంటనే విచారణ చేయాలని కోరారు. సర్క్యులేషన్ పెంచుకోవడం కోసం వాలంటీర్లు, సచివాలయం సిబ్బందికి ప్రభుత్వ సొమ్ముతో సాక్షి పత్రిక కొనిపించారని విమర్శించారు. ఈ డబ్బంతా సీఎం ఛానల్, పేపర్‌కు ఇచ్చారన్నారు. ఐదేళ్లు దోచుకున్నారని, కమిషనర్ విజయకుమార్ రెడ్డికి బదిలీ అయిందని, విచారణ పూర్తి అయ్యేవరకు ఆయనను రిలీవ్ చేయకూడదన్నారు. అడిషనల్ కమిషనర్ కస్తూరిపై చర్యలు తీసుకోవాలని, ప్రతి పథకంను నాలుగుగా విభజించి ప్రకటనలు ఇచ్చారన్నారు. జగన్ కోసం, సాక్షి మీడియాకు లాభం చేకూర్చేందుకు ప్రకటనలు ఇలా ఇచ్చారని ఆరోపించారు. జగన్ కుటుంబం అనుచిత లబ్ధి పొందిందన్నారు. అనుచిత లబ్ధి చేకూర్చిన సొమ్మును రికవరీ చేయాలన్నారు. ప్రభుత్వం , పాలకులు మారారని.. అధికారులు మాత్రం మారలేదని అన్నారు. ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రకటనలు చూస్తే పక్షపాత ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని, పక్షపాత ధోరణి లేదని మంత్రి ఎలా చెబుతారని ధూళిపాళ నరేంద్ర అన్నారు. సభను తప్పుదోవ పట్టించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఏడాదిలో అమరావతికి రూపం

గుంటూరు, జూలై 26,బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం ప్రకటించిన 15వేల కోట్ల సాయంతో.. నవ్యాంధ్రకు క్యాపిటల్ వర్క్స్ మళ్లీ ట్రాక్ ఎక్కనున్నాయి.రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అమరావతి నిర్మాణంపై దృష్టి పెట్టింది. సీఎం చంద్రబాబు అమరావతిలో పర్యటించి.. పెండింగ్‌లో ఉండిపోయిన పనులను పరిశీలించారు. గత ఐదేళ్లలో అడవిలా మారిపోయి.. రోడ్లు, కాలువలు, రైతులకు ఇచ్చిన స్థలాలు ఎక్కడున్నాయో తెలియని దుస్థితిలో ఉన్న రాజధానిలో ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభమయ్యాయి. రాజధాని ఏరియాలో కంప చెట్లను తొలగించేందుకే రూ.36 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి టెండర్లు పిలిచారు. మధ్యలో నిలిచిపోయిన రోడ్లు, ఇతర ప్రధాన మౌలిక వసతులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అఖిల భారత సర్వీసు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల నివాస భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కోసం ప్రణాళిక రెడీ చేస్తోంది ఏపీ సర్కార్. ఈ దశలో కేంద్రప్రభుత్వం రూ.15 వేల కోట్లు ఇస్తామని ప్రకటించడంతో రాజధాని నిర్మాణ పనులను స్పీడప్ చేసేందుకు ఓ మార్గం దొరికింది.ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.15 వేల కోట్ల ఆర్థికసాయం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించడంతో అమరావతి నిర్మాణం ఇక దూసుకెళ్లనుంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ముళ్ల చెట్లు, నీళ్లల్లో మునిగిన కట్టడాలతో బోసిపోయిన రాజధాని ప్రాంతం మళ్లీ కొత్త రూపం దాల్చుకుంటోంది. వనరుల కొరతే పెద్ద సమస్యగా ఉన్న పరిస్థితుల్లో కేంద్రం చేసిన ప్రకటనతో ఊరట దక్కింది. మరో నాలుగైదు నెలల్లోనే రాజధాని పనులు పూర్తిస్థాయిలో ప్రారంభించనుంది ఏపీ సర్కార్.రాజధాని నిర్మాణానికి ప్రపంచబ్యాంకు వంటి ఆర్థిక సంస్థల నుంచి ఒక్క ఏడాదిలోనే రూ.15వేల కోట్ల సాయం అందిస్తామని.. అవసరాన్ని బట్టి ఇతర సంస్థల నుంచి మరిన్ని నిధులు ఇస్తామని కేంద్రం బడ్జెట్‌లో హామీ ఇచ్చింది. ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన స్పందించాల్సిన బాధ్యత రాష్ట్ర యంత్రాంగంపై ఉంది. కేంద్ర ప్రభుత్వంతో పాటు వివిధ బ్యాంకులతోనూ సంప్రదింపులు జరిపి, నిధులు తెచ్చుకుని త్వరగా రాజధాని పనులు మొదలుపెడితే.. మరో ఏడాదిలోనే అమరావతికి ఒక రూపం రానుంది. కేంద్రాన్ని ఒప్పించి మరిన్ని నిధులు తెచ్చుకోగలిగితే ఆంధ్రులకు అద్భుతమైన కలల రాజధాని సాకారమవుతుంది.రాజధానిలో ప్రధాన మౌలిక సౌకర్యాలు, రైతులకు స్థలాలిచ్చిన ల్యాండ్ పూలింగ్ స్కీమ్ లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతుందని 2019కి ముందు అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం అంచనాలు రూపొందించింది. రూ.41 వేల కోట్లకు టెండర్లు పిలిచింది. రూ.5 వేల కోట్లకుపైగా నిధులతో కొన్ని పనులు చేపట్టింది. గతంలో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు రూ.1,300 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది.

అప్పట్లో రాజధాని ఏరియాలో పనులు చేపట్టేందుకు రూ.41 వేల కోట్లతో పనులు మొదలుపెట్టినా ఇప్పుడు వాటి ఖర్చు భారీగా పెరగనుంది. దీంతో అంచనాలు పెంచి మళ్లీటెండర్లు పిలవాల్సిన అవసరం ఉంది.రాజధానిలో నిలిచిపోయిన పనులన్నీ త్వరలోనే మొదలయ్యే అవకాశం ఉంది.

# 28న విద్యా సదస్సును జయప్రదం చేయండి

## - యూటీఎఫ్ పిలుపు

బద్వేలు,ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఆదివారం ఉదయం 10 గంటలకు జరగబోవు రాష్ట్రస్థాయి విద్యాసదస్సును జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా రాష్ట్రమంతటా స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయని ఈ స్వర్ణోత్సవాల్లో భాగంగా వివిధ జిల్లాలలో సమకాలీన అంశాలపై రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహించి ఉపాధ్యాయులను చైతన్య పరచడం జరుగుతున్నదని తెలిపారు 2024 మే నెలలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర పరిస్థితులను శ్వేత పత్రాల రూపంలో ప్రభుత్వం ముందుకు తీసుకొస్తున్నదని మరి శ్వేత పత్రాలలో వాస్తవ విషయాలు తెలియచేయటం జరుగుతున్నదని తెలిపారు ఇటీవల విడుదల చేసిన ఆర్థిక శ్వేత పత్రం కూడా ఇలాగే ఉందని గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పులకుప్పగా మారిందని దీనికి ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలతో పాటు కేంద్ర ప్రభుత్వ విధానాలు కూడా కారణమని తెలిపారు ఈ నేపథ్యంలో దేశ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై అవగాహన కలిగించే నిమిత్తం ఈనెల 28వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల బాలాజీ నగర్ నందు రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆర్థిక శ్వేత పత్రం వాస్తవాలు అన్న అంశంపై భక్తగా శ్రీ వి రాంభూపాల్ గారు అలాగే ప్రత్యామ్నాయ విద్యా విధానం అన్న అంశంపై యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కె ఎస్ ఎస్ ప్రసాద్ గారు వివరిస్తారని తెలిపారుజిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విద్యా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్ ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ నాయకులు గోపీనాథ్ వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు

# టీడీఆర్ బాండ్ల జారీలో భారీ స్కాం

తిరుపతి, జూలై 26, ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో టీడీఆర్ బాండ్ల జారీలో భారీ స్కాం జరిగింది. పురపాలక శాఖ ప్రాథమిక విచారణలోనే వందల కోట్ల అక్రమాలు వెలుగు చూశాయి. పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తే కాని దాని లోతు ఎంతో తెలిసే అవకాశం కనిపించడం లేదు.పట్టణ ప్రణాళికా విభాగంపై జరిపిన సమీక్షలో టిడిఆర్ బాండ్ల రూపంలో జరిగిన వందల కోట్ల దుర్వినియోగం వెలుగు చూసింది. టౌన్ ప్లానింగ్ లో రాష్ట్ర స్థాయి నుంచి కింది స్థాయి వరకూ ఉన్న అధికారులు, ఉద్యోగులు అనుసరిస్తున్న విధానాల్లో లోపాలను ప్రభుత్వం గుర్తించింది.ఇకపై భవన నిర్మాణాల అనుమతులను పూర్తిగా ఆన్ లైన్ లోనే ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఎన్ని అంతస్తుల భవనమైనా ఆన్ లైన్‌లో మాత్రమే అనుమతి జారీ చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది.విశాఖపట్నం, తణుకు, గుంటూరు, తిరుపతి నగరాల్లో టీడిఆర్ బాండ్ల జారీలో భారీగా అక్రమాలు జరిగినట్టు ప్రభుత్వం గుర్తించింది. తణుకులో జరిగిన అక్రమాలపై వేసిన అధికారుల కమిటీ ప్రాథమిక నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి అందచేసింది. నివేదికపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయనున్నట్టు మంత్రి నారాయణ ప్రకటించారు.తణుకులో 29 బాండ్లు జారీ చేస్తే అవన్నీ అక్రమమేనని గుర్తించారు. ప్రభుత్వ బాండ్ల జారీలో భూమికి ఎకరాల ప్రకారం విలువ కట్టాల్సి ఉన్నా చదరపు గజాల ప్రకారం భూమి విలువ కట్టి అక్రమాలకు పాల్పడ్డారు. ఒక చదరపు గజానికి విలువ రు.4500 ఉండాల్సిన చోట రూ.22వేల రూపాయల మార్కెట్ విలువ లెక్క కట్టారు. పరిహారంగా 1:200 ఇవ్వడానికి బదులు 1:400 గా ఇచ్చారు.భూసేకరణలో స్థలం కోల్పోతున్న భూమికి సమీపంలో ధర కంటే ఎక్కడో 1.4 కిమీ దూరంలో ఉన్న భూమి విలువను పరిగణనలోకి తీసుకుని బాండ్లను జారీ చేయడం పెద్ద స్కాం అని భావిస్తున్నారు. తణుకులో బాండ్ల జారీలో అక్రమాలకు పాల్పడ్డ ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. బాండ్ల జారీలో అక్రమాలు జరిగాయో అలాంటి చోట్ల ఇచ్చిన బాండ్లను నిలిపి వేసినట్లు చెప్పారు. కోర్టుకు వెళ్లిన 300 మంది బాండ్లను మార్చుకున్నారని...గత ప్రభుత్వంలో పాలన సున్నా అనేది బాండ్ల జారీ ద్వారా నిరూపితమైందన్నారు.తిరుపతిలో రెండు టీడీఆర్ బాండ్ల లో చదరపు గజం విలువ 40,000 గా అధిక ధర చూపించారు. గుంటూరులో కూడా చదరపు గజం విలువ 9000 ఉండాల్సింది 20000 గా చూపించి బాండ్లు జారీ చేశారు. విశాఖపట్నంలో గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయకుండా నోటరీ అప్రూవల్ తో బాండ్లు జారీ చేసి అక్రమాలకు పాల్పడ్డారు.రాష్ట్ర వ్యాప్తంగా వందల కోట్లను ఇలా బాండ్ల రూపంలో అధికారులు, అక్రమార్కులు కుమ్మక్కై దోచేశారు. రాజకీయ నాయకులు చెప్పినా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి నారాయణ సూచించారు.రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో బదిలీ చేస్తారనే భయంతో అధికారులు పని చేసినట్లు మంత్రి చెప్పారు.టీడీఆర్ బాండ్ల జారీ అక్రమాల్లో నాయకులదే మొదటి తప్పని, టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలపై సీఎం తో చర్చించి అవసరమైతే మరికొన్ని కమిటీలు వేసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.ఇకపై ఎన్ని అంతస్తుల భవనం నిర్మాణం అయినా అనుమతులను ఆన్ లైన్ లోనే ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. 15 రోజుల్లోగా దరఖాస్తు పరిశీలించి ఎక్కడైనా సమస్య ఉంటే మరోసారి అర్జీదారునికి సమాచారం ఇవ్వాలని ప్రభుత్వానికి చెడ్డ పేరు అయినా మంచి పేరు అయినా తీసుకురావడం లో టౌన్ ప్లానింగ్ కీలకమైందన్నారు. ఈ విషయంలో ముఖ్య మంత్రి తనకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని మంత్రి చెప్పారు.రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు త్వరలో కౌలు చెల్లించనున్నట్టు మంత్రి చెప్పారు. త్వరలోనే రైతులకు కౌలు నిధులు విడుదల చేస్తామని మంత్రి చెప్పారు.ఏ రైతునూ ఇబ్బంది పెట్టమన్నారు. కేంద్రం ప్రకటించిన 15 వేల కోట్ల నిధులతో అమరావతి వేగంగా ముందుకెళుందని మంత్రి నారాయణ చెప్పారు. జైకా వంటి సంస్థల ద్వారా నిధులు ఇస్తున్నారని అన్నారు. అమరా వతిలో నిర్మాణాల పటిష్టత అధ్యయనానికి ఐఐటి చెన్నై,ఐఐటి హైదరాబాద్ సంస్థలను ఉపయోగించుకుంటున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. పనులు ఎలా మొదలు పెట్టాలని దానిపై సాంకేతిక కమిటీ వేసినట్లు చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



.శ్రీ ప్రస్థానం న్యూస్ కోవెలకుంట్ల – కోవెలకుంట్ల మండలంలో ని స్థానిక పట్టణములోని ఇందిరమ్మ కాలనికి చెందిన వాల్మీకి నాగేంద్ర శుక్రవారం నాడు ఆటో ప్రమాదంలో దుర్మరణం పొందారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాలమేరకు కర్నూలు-కడప జాతీయ రహదారిలోని శిరివెళ్ల మెట్ట వద్ద శుక్రవారం కూల్ డ్రింక్స్ లోడుతో వెళుతున్న ఆటోకు రోడ్డు ప్రమాదం జరిగినట్లు తెలిపారు. కోవెలకుంట్ల వైపు నుంచి వెళుతున్న ఆటోను లారీ ఢీ కొనడంతో ఈ ఆటో డ్రైవర్ నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందారని, మరో వ్యక్తి తీవ్రంగా గాయలు అయినట్లు వారు తెలిపారు. శిరివెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేటున్నారు.

## పొలంబడి కార్యక్రమం.

**రైతులతో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ.**





నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ లో భాగంగా పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని శ్రీరంగాపురం గ్రామాన్ని పొలంబడి కింద ఎంపిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అందులో భాగంగా ఈరోజు పొలంబడి నిర్వహిస్తున్నటువంటి రైతులతో చర్చించడం జరిగిందన్నారు. ఇందులో ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఏ విధంగా పెంపొందించుకోవాలనే అంశాలను రైతులకు సమగ్రంగా వివరించడం జరిగిందన్నారు. ఇందులో విత్తనం చేసినప్పటి నుంచి పంట కోత జరిగే వరకు ప్రతి రైతును శాస్త్రవేత్తగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో రైతులకు నారుమడి యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. ఈ రైతులు పండించినటువంటి ఉత్పత్తులను రాబోయే రోజుల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘంతో కలిసి ఆన్లైన్ మార్కెటింగ్ ద్వారా అదిక ఆదాయాన్ని పొందే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, రైతు సేవ కేంద్ర సిబ్బంది శ్రీకాంత్, గ్రామ రైతులు నారాయణరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా తయారు చేసిన,విక్రయించిన వారిపై కఠిన చర్యలు

శ్రీ ప్రస్థానం-గడివేముల:- జులై 27:- నాటు సారా తయారు చేసిన,విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఈ బి ఇన్స్పెక్టర్ జి విశ్వనాథరెడ్డి తెలిపారు. గడివేముల మండలంలోని తిరుపాడు గ్రామంలో శుక్రవారం ఎస్ ఈ బి ఇన్స్పెక్టర్ జి విశ్వనాథరెడ్డి అద్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు.పి కృష్ణవేణి అనే మహిళ వద్దనుండి 30 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



# సబ్సీడీ పై జీలుగ విత్తనాలను పంపిణీ చేయండి : జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్





శ్రీ ప్రస్థానం – నంద్యాల, జూలై 26:- సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. నంద్యాల మండలం బిల్లాలపురం గ్రామ శివారు ప్రాంతాలలోని పచ్చిరొట్ట పైరు పంటను జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ సబ్సిడీపై జిలుగు విత్తనాలను రైతులకు పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎకరాకు 12 కిలోల జీలుగు విత్తనాలు అవసరమవుతాయని 30 రోజుల్లోగా పంట ఏపుగా పెరిగి పూర్తి దశకు చేరుకుంటుందని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ జాయింట్ కలెక్టర్ కు నివేదించారు. అనంతరం సీడ్ విలేజ్ వరి విత్తన నర్సరీని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. రైతు సేవా కేంద్రాన్ని కూడా తనిఖీ చేసి సబ్సిడీపై విత్తనాలు ఎలా ఇస్తున్నారు, ఒక్కొక్క రైతుకు ఎంతమేర ఇస్తున్నారని అని గ్రామ వ్యవసాయ సహాయకులను జేసీ ప్రశ్నించారు. రైతు సేవా కేంద్రంలో ప్రదర్శించిన పొలంబడి సీడ్ విలేజ్ ప్రోగ్రాం కింద చేపట్టిన అంశాలను పరిశీలించారు. బిల్లాలాపురంలో 114 మంది సీసీఆర్సీ కార్డులకు అర్హత పొందారని డీఈవో జాయింట్ కలెక్టర్ కు తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను పంపిణీ చేశారు.

# తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: జిల్లా పోలీసులు









శ్రీ ప్రస్థానం – నంద్యాల, జులై 26:- నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఐపిఎస్ ఆదేశాలమేరకు నంద్యాల జిల్లాలోని వివిధ స్కూలు మరియు కళాశాలలో జిల్లా పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై అనగా చిన్న పిల్లలు మహిళలపై జరిగే నేరాల గురించి, ట్రాఫిక్ నియమాలు మరియు రోడ్డు భద్రత నిబంధనలు, హెల్మెట్ ప్రాముఖ్యత, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్,డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు,రాగింగ్ మొదలగు వాటి గురించి స్కూల్లో కాలేజీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అనంతరం పిల్లలందరూ బాగా చదువుకోవాలని చిన్నతనం నుంచే సత్ప్రవర్తనతో మెలగాలని , మీరు మీ తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకుని వచ్చే వారిగా ఉండాలని, మీ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చి మీ యొక్క చదువులలో మరియు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నట్లు పోలీస్ అధికారులు పిల్లలకు తెలియజేశారు. ఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు ఉన్నాయెడల 100,112 నంబర్లకు తెలియజేయాలని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు..

# వెజిట్రబుల్స్.....ఏ కూరైన రూ.50 పైనే



హైదరాబాద్, జూలై 26, (న్యూస్ పల్స్) కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. సామాన్యులకు అందనంతా దూరంగా రేట్లు భారీగా పెరిగిపోయాయి. ఏ కూరగాయ ధర అడిగినా కిలో రూ. 50కి పైనే చెబుతున్నారు. ఇక టమోటాల రేట్లకైతే మళ్లీ రెక్కలు వచ్చాయి. కిలో టమోటా రేటు వంద రూపాయలను మరోసారి టచ్ చేయడంతో వినియోగదారులు విలవిల్లాడుతున్నారు. దీంతో ఏం కొనేటట్టు లేదు, ఏం తినేటట్టు లేదు అని వినియోగదారులు నిట్టూరుస్తున్నారు. టమాటతో పాటు.. అన్ని రకాల కూరగాయలు రూ.50 నుంచి 80 వరకు అమ్ముడవుతున్నాయి.. దీంతో ప్రజలు కర్రీ వర్రీ అంటూ తంటలు పడుతున్నారు. కాగా.. టమాట ధరలు పెదరగడంతో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. రైతు బజార్లలో కిలో 48 రూపాయలకే ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది ఏపీ ప్రభుత్వం. మార్కెటింగ్ శాఖ ద్వారా విశాఖలోని 13 రైతు బజార్లలో కిలో 48 రూపాయలకు టమోటా అమ్మకాలు చేపట్టారు. దీంతో సబ్సిడీ కౌంటర్లకు భారీగా క్యూ కడుతున్నారు ప్రజలు.ఇక తెలంగాణలో కూడా వెజ్ ట్రబుల్స్ కనిపిస్తున్నాయి. కూరగాయల రేట్లు.. జనానికి చుక్కలు చూపిస్తున్నాయి. ఏ కూరగాయ కొందామన్నా కిలో వంద అంటూ షాక్ ఇస్తున్నారు వ్యాపారులు. భారీ వర్షాల కారణంగా రవాణాపై ప్రభావం పడడంతో, కూరగాయలు రేట్లు పెరిగాయని చెబుతున్నారు. టమోటా కిలో 100, పచ్చి మిర్చి కిలో వంద,చిక్కుడు కిలో 120, క్యారట్ కిలో వంద, కాకర కిలో 90, కేలిఫ్లవర్ కిలో 80 రూపాయలు పలుకుతున్నాయి. ఇక ఆకుకూరల రేట్లు కూడా మండిపోతున్నాయి. గతంలో మూడు వందల రూపాయల కూరగాయలు కొనుగోలు చేస్తే వారం రోజులకు సరిపోయేవి. ఇప్పుడు కనీసం రెండు రోజులకు కూడా సరిపోవడం లేదని జనం నిట్టూరుస్తున్నారు.కూరగాయల రేట్లు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇక కరీంనగర్‌లో స్థానికంగా కూరగాయల సాగు కూడా తగ్గింది. దీంతో దిగుమతులపై ఆధార పడాల్సి వస్తోంది. ఇక ఉల్లి రేటు కూడా ఘాటెక్కింది. అన్ని రకాల కూరగాయల ధరలు పెరుగుతున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. భారీ వర్షాల వల్లే రేట్లు పెరుగుతున్నాయంటున్నారు వ్యాపారులు.హైదరాబాద్‌లో కూడా కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. వర్షాలకు పంటలు దెబ్బతినడం.. సమయానికి పంట చేతికి అందకపోవడంతో దిగుబడులు తగ్గి కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కిలో టమోటా వంద రూపాయలకు చేరడంతో.. దానికి సామాన్యులు టాటా చెప్పే పరిస్థితి వచ్చింది. రైతు బజార్లలో కూడా టమోటాలను సబ్సిడీ రేట్లకు అమ్మడం లేదని వినియోగదారులు కంప్లయింట్ చేస్తున్నారు. నిత్యం హైదరాబాద్‌కు 6 వేల క్వింటాళ్ల టమాటాలు వస్తుంటాయి.. ప్రస్తుతం 2.5 నుంచి 3వేల క్వింటాళ్లే వస్తున్నాయి. దీంతో టమోటాకు డిమాండ్ పెరిగి ధర కొండెక్కింది.

## జగనన్న చెత్త బండ్లకు గ్రహణం..

**ముళ్ళ కంప పొదల్లో తుప్పు పట్టి పోయిన ఆటోలు, చెత్త సైకిళ్ళు..పట్టించుకోని అధికారులు**





దొర్నిపాడు, జూలై:26, శ్రీ ప్రస్థానం న్యూస్:- రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్ రెడ్డి,గ్రామాల్లో చెత్త ను సేకరించడ మే లక్ష్యం తో వేలు,లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జగనన్న చెత్త బండ్లకు నేడు గ్రహణం పట్టింది... వివరాల్లోకి వెళ్ళితే దొర్నిపాడు మండలం లో ఉన్న ప్రతి గ్రామ పంచాయతీకి కేటాయించిన చెత్త బండ్లతో కొన్ని గ్రామాల్లో మాత్రమే పారిశుద్ధ కార్మికులు వాటి ద్వారా చెత్తను తొలగిస్తున్నారు కానీ మండల కేంద్రమైన దొర్నిపాడు గ్రామానికి కేటాయించిన బండ్ల ద్వారా ఒక్కరోజు కూడా చెత్తను తొలగించిన పాపాన పోలేదని ప్రజలు అంటున్నారు వేలు లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆటోలు చెత్త సైకిళ్లు తుప్పు పట్టి మరమత్తుల కు నోచుకోకుండా మూలనబడ్డాయి మరి చెత్త సైకిల్ ముళ్ళకంప పొదల్లో ఉన్న వాటిని తీసి మరమ్మతులు చేయించాలనే ఆలోచన కూడా సంబంధిత అధికారులకు రాలేదని చెప్పవచ్చు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలకు చెత్త కోసం ఏర్పాటు చేసిన బండ్లను మరమ్మత్తు చేయించి చెత్తను తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు...

## జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు,పరిశ్రమల భూసేకరణ పూర్తిచేయండి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

నంద్యాల, జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, పరిశ్రమలు ఇతర భూసేకరణకు సంబంధించి ప్రతిపాదనలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. .కలెక్టర్ ఛాంబర్ లో పెండింగ్ లో ఉన్న భూసేకరణపై జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ తో కలిసి రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ ఏ పద్మజ, ఆర్డీవోలు మల్లికార్జున రెడ్డి, ఎం దాసు, మహేశ్వర్ రెడ్డిలు, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, నేషనల్ హైవే పిడి గోవర్ధన్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 340 సి ప్యాకేజీ 4 కింద జూపాడుబంగ్లా, పాములపాడు, నందికొట్కూరు, ఆత్మకూరు మండలాలు మీదుగా వెళ్లే రహదారి భూసేకరణకు సంబంధించి 75.47 ఎకరాలు పెండింగ్లో ఉందని... ఇందుకు సంబంధించి తాసిల్దారుల నుండి క్లెయిమ్స్ తెప్పించుకొని నిశితంగా పరిశీలించి ప్రతిపాదనలు పంపవాలని ఆర్డిఓలను ఆదేశించారు. 167 కె ఒకటవ ప్యాకేజీ క్రింద (నంద్యాల నుండి జమ్మలమడుగు వరకు) నంద్యాల, గోస్పాడు, దొర్నిపాడు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, సంజామల మండలాల మీదుగా వెళ్లే రహదారి సంబంధించి పెండింగ్ లో ఉన్న అవార్డ్స్ ను త్వరితగతిన పాస్ చేయాల్సిందిగా నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. 167 కె ప్యాకేజ్ 4 కింద 5 మండలాలు 22 గ్రామాలకు చెందిన 177 ఎకరాల క్లెయిమ్స్ పెండింగ్లో ఉన్నాయని ఇందుకు సంబంధించి తాసిల్దారుల నుండి నివేదికలు తెప్పించుకొని సమర్పించాలని ఆర్డీవోలను ఆదేశించారు. 167 కె ప్యాకేజీ – 5 కింద నల్లకాలువ నుండి వెలుగోడు వరకు 3ఎ ప్రతిపాదనలను ఏపీఆర్డిసి కార్య నిర్వహణ అధికారి నుండి ప్రతిపాదనలు తెప్పించుకోవాలని భూసేకరణ అధికారులను ఆదేశించారు. రోడ్లు భవనములు సంబంధించి రహదారుల విస్తరణ, రైల్వే ప్రాజెక్టులు, సిమెంట్ పరిశ్రమలు, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్, చుక్కల భూములు, అన్యాక్రాంత భూములు తదితరాలకు సంబంధించిన ప్రతిపాదనలు, నివేదికలను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులు, ఆర్డీవోలను ఆదేశించారు.

## నంద్యాల పట్టణంలో నంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహణ...

**జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా**

నంద్యాల పట్టణంలో నంబర్ ప్లేట్ లేని వాహనాలపై గత రెండు రోజులుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా నంద్యాల పట్టణ పరిధిలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఈ డ్రైవ్ చేయడం జరిగింది. ఇందులో భాగంగా నంద్యాల పట్టణంలో నంబర్ ప్లేట్ లేని 52 మోటార్ సైకిళ్ళను సీజ్ చేసి మోటార్ వెహికల్ చట్టం ప్రకారం జరిమాన విధించడం జరిగింది. అనంతరం వారు సదరు వాహనానికి

సంబంధించిన నంబర్ ప్లేట్ తెచ్చిన తర్వాత వాహన ధ్రువపత్రాలను పరిశీలించి సదరు వాహనాలను సంబంధిత వ్యక్తులకు అప్పగించడం జరిగిందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ నంద్యాల జిల్లా అంతట ఈ స్పెషల్ డ్రైవర్ నిర్వహించడం జరుగుతుందని కావున ప్రతి ఒక్కరూ వారి వెహికల్ కు సంబంధించిన నంబర్ ప్లేట్ కలిగి ఉండాలని మరియు మోటర్ వెహికల్ పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మరియు ఫోర్ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని మరియు రోడ్డు భద్రత నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరాలని తెలియజేశారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757